## క్లుప్తంగా

### గుట్కాలు విక్రయించొద్దు

నాగారం : ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, మాదకద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మండల పరిధిలోని ఫణిగిరి ఎక్స్‌రోడ్డు వద్ద కిరాణం షాపులు, టీస్టాల్స్‌లలో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ఈ తనిఖీల్లో రూ.1200 విలువ గల గుట్కాలు, అంబర్, ఖైనీలను పట్టుకొని సీజ్ చేసి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు కలిగి ఉన్నా.. అమ్మినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

### అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మద్దిరాల : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండల పరిధిలోని ముకుందాపురం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. దీంతో పలుచోట్ల ఇసుక డంపులు ఉండగా వాటిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ముకుందాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామ పంచాయతీ ఆవాసం మర్రిబాయితండా, మేడిబాయితండాలలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాలలో 100 పశువులకు టీకాలు వేశారు. ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం పశు వైద్యశాల వీఎల్‌ఓ కేఎస్ఎస్.పద్మ, గోపాల మిత్ర సూరారపు అర్జున్, సిబ్బంది యాదగిరి, యాకయ్య, రైతులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగారం : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈఈ మహేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగారంలోని 133/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 8:30గంటల నుంచి 12:30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. అంతరాయానికి సహకరించాలని ప్రజలను కోరారు.

### రాష్ట్రస్థాయి క్రీడాకారుడు శ్రీకాంత్‌యాదవ్‌కు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబీకులు, స్నేహితులు

అర్వపల్లి : హైదరాబాద్ సీఐ ఎల్లంల మన్మోహన్‌యాదవ్ సోదరుడు, రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారుడు ఎల్లంల శ్రీకాంత్‌యాదవ్ తృతీయ వర్ధంతిని శుక్రవారం జాజిరెడ్డిగూడెంలోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ చిత్రపటానికి అతడి కుటుంబ సభ్యులు, స్థానిక జెడ్పీహెచ్ఎస్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ ఎల్లంల కొమిరెల్లి-భారతమ్మ దంపతులు, కోమలత, టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అల్వాల రమేష్, మామిడి నాగరాజు, పగిడిమర్రి శేఖర్, మాదగాని సుదర్శన్, డి. శంకరాచారి, శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి



ఇరిగేషన్ ఏఈని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ

హుజూర్‌నగర్‌రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు. అనంతరం జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో చెరువులు, కుంటల మట్టిని కొందరు దళారులు తరలిస్తున్నారని అన్నారు. అలాగే దళారులు రైతులతో కుమ్మక్కై చెరువు శిఖం భూములను ఆక్రమిస్తుంటే ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తును వదలడం లేదని విమర్శించారు. ఇరిగేషన్ ఏఈ తుమ్మల శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య, మండల వైద్యాధికారి పుష్పలత, ఎంఈఓ సైదానాయక్, పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, ఎంపీఓ శైలజ పాల్గొన్నారు.

# ముప్పై ఏళ్ల నిరీక్షణ ఫలించేనా..

- తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మోక్షం
- ఎన్నికల కోడ్ ముగిశాక ప్రకటన విడుదల చేయనున్న ప్రభుత్వం



తిరుమలగిరిలో 1991లో వేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల శిలా ఫలకం

తిరుమలగిరి : తిరుమలగిరి సమీప ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కల సాకారం కాబోతుంది. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు విషయాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు సానుకూలం వ్యక్తం చేశారని, ఎన్నికల కోడ్ ముగియగానే కళాశాల మంజూరుపై ప్రకటన వస్తుందని ఎమ్మెల్యే సామేల్ ఇటీవల విలేకరుల సమావేశంలో తెలిపారు.

**1991లో శంకుస్థాపన..**

తిరుమలగిరి మండలంలో ప్రతి సంవత్సరం వెయ్యి మందికి పైగా విద్యార్థులు పది పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 1991 డిసెంబర్ 19వ తేదీన జూనియర్ కళాశాల ఏర్పాటుకు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఎస్.సంతోష్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వాలు మారడంతో కళాశాల ఏర్పాటుకు నోచుకోలేదు. ప్రతి ఎన్నికల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అంశం ఎన్నికల ప్రచార అస్త్రంగా మారింది. ఈసారి ఎన్నికల్లో గెలిపిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ నాయకులు గెలవగానే మరిచి పోయారు. ఎట్టకేలకు 33 సంవత్సరాల తరువాత జూనియర్ కళాశాల మంజూరు అవుతుండడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్థిక భారం తగ్గుతుంది**



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడితే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. వారిపై ఆర్థిక భారం తగ్గుతుంది. విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుంది. జూనియర్ కళాశాల మంజూరు చేస్తున్నందున ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞులై ఉంటారు.

\- కందుకూరి అంబేద్కర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

**పేద విద్యార్థులకు ఎంతో మేలు..**

తిరుమలగిరిలో ప్రస్తుతం పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం వివిధ ప్రాంతాలతో పాటు స్థానికంగా ఉన్న ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు. దీంతో విద్యార్థులు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడితే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వ కళాశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి కూడా సమకూరుతుంది.

## పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సూర్యాపేట : పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని వెన్నెల ఆస్పత్రి డాక్టర్ మామిడి నరేష్ అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు వినియోగం కారణంగా గొంతు, నాలుక, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడడంతో కేన్సర్ సోకే అవకాశం ఉంటుదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే దూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాల్సిందేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్నెల ఆస్పత్రి నిర్వాహకులు బయ్య నారాయణ, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో అక్రమంగా చెట్ల నరికివేత



పాఠశాల ఆవరణలో పడేసిన దుంగలు

తుంగతుర్తి : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు విరివిగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతుంటే కొంతమంది కావాలని చెట్లను నరుకుతూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. తూర్పుగూడెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉన్న చెట్లను కొంతమంది శుక్రవారం అక్రమంగా నరికివేశారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నీడనిచ్చే చెట్లను నరికి వేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల బెడదతో చెట్లను నరకడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా లక్ష మల్లెల పుష్పార్చన



పిల్లలమర్రిలో స్వామివారికి పుష్పార్చన

భానుపురి : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష మల్లెల పుష్పార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు సామూహికంగా మల్లెల అర్చన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కొత్త వెంకటేశ్వర్లు, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పిల్లలమర్రిలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఆంజనేయ స్వామికి లక్ష మల్లె పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దరూరి వెంకట రాఘవాచార్యులు, ఆలయ ధర్మకర్త గవ్వ కృష్ణారెడ్డి మాట్లాడారు. అతి పురాతన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో లోక రక్షణార్థం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యం అని పేర్కొన్నారు. లక్ష మల్లె పుష్పార్చన కార్యక్రమానికి దాతలు బ్రహ్మదేవర సీతయ్యకళావతి దంపతులు సహకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దరూరి సింగరాచార్యులు, చింతాడ రామానుజాచార్యులు, ముడుంబై రఘువరన్ ఆచార్యులు, అబ్బూరి వినోద్, శ్యామల, షేక్ జానిమియా, సికిర వీరేశం, సరస్వతి, దేవరశెట్టి ముకుందం, మనసాని నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో పూజల్లో పాల్గొన్న భక్తులు



సూర్యాపేట : పిల్లలమర్రిలో..

## నేడు సూర్యక్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ శివారులోని సూర్యక్షేత్రం ఆవరణలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి శుక్రవారం తెలిపారు. హనుమాన్ ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలతో పాటు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఉత్సవాలకు కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## శ్రీభక్త బాలాంజనేయస్వామి ఆలయంలో హోమం



హోమం పూజల్లో పాల్గొన్న మాలధారులు

అర్వపల్లి : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జాజిరెడ్డిగూడెంలోని శ్రీభక్త బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మోత్కూరు ప్రవీణ్‌శర్మ, గురుస్వామి కీర్తి వెంకటేశ్వర్లు, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, మెరుగు వీరమల్లు, బింగి రమేష్, నర్సింగ పెదలింగయ్య, చెన్నబోయిన మురళి, నిమ్మల నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు హనుమాన్ జయంతి ఉత్సవాలు**

జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని శ్రీ భక్త బాలాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో 41 రోజుల దీక్ష సందర్భంగా 30 మంది వరకు హనుమాన్ మాలలు ధరించారు. మాలధారులు ఆలయంలో పూజలు నిర్వహించి ఇరుముడులతో జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయానికి తరలివెళ్లనున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. హనుమాన్ భక్తులు జయంతి ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలిరావాలని హనుమాన్ మాలధారులు కోరారు.

## లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



తిరుమలగిరి: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్(ఎస్) : రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల షాపుల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. విత్తన దుకాణదారులు నాణ్యమైన విత్తనాలను అమ్మి రైతులకు కచ్చితంగా రసీదును అందజేయాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలను, ఎరువులను, పురుగుల మందును అమ్మిన పక్షంలో వారి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్టాక్ వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరశర్మ, తహసీల్దార్ వినోద్ కుమార్, ఏఎస్‌ఐ శంకర్ నాయక్, ఏఈఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : రైతులకు నాణ్యమైన విత్తనాలను అందివ్వాలని, ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ధరల పట్టిక కనిపించేలా ప్రదర్శించాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధా, ఎస్‌ఐ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యమైన పత్తి విత్తనాలను విక్రయించాలి**

మద్దిరాల : వ్యాపారులు రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అమ్మాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఏఓ వికాస్ పాటిల్ అన్నారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపులను వారు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మధునాయుడు, సిబ్బంది, షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..



మద్దిరాలలో..

## బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎంఈఓ



పెన్‌పహాడ్‌లో..



తుంగతుర్తిలో..

తిరుమలగిరి : జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అమ్మ ఆదర్శ చైర్మన్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.లాజర్, తహసీల్దార్ సుధ, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీఓ మారయ్య, ఏపీఎం సైదయ్య, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓఏలు, సీఆర్పీలు, ఎస్ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను పూర్తిచేయాలని సూచించారు. జూన్ 2న అన్ని పాఠశాలల్లో విధిగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అజయ్‌నాయక్, పీఆర్ఏఈ కిరణ్‌కుమార్, ఏఓ కృష్ణసందీప్, ఆర్‌ఐ మట్టయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యే బడి బాట కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికుమార్, పీఆర్ఏఈ రాంబాబు, ఎంపీఓ భీంసింగ్, డీటీ స్వప్న, ఏపీఎం నర్సయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీడీఓ ధార శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలు నాయక్, నోడల్ అధికారి వాసం ప్రభాకర్, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, ఏపీఎం శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

నూతనకల్ : బడి ఈడు పిల్లలను బడికి రప్పించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ సునీత కోరారు. ఈ నెల 3 నుంచి 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, ఎంపీఓ శశికళ, ఏపీఎం కర్ణాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల సంఖ్య పెంచాలి**

చివ్వెంల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని తహసీల్దార్ జి.క్రిష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై అధికారులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలు కచ్చితంగా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుని జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎంఈఓ గోపాల్‌రావు, వైద్యాధికారి భవాని, ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



నూతనకల్‌లో..



చివ్వెంల : మాట్లాడుతున్న తహసీల్దార్ క్రిష్ణయ్య

## పూర్తి కావొస్తున్న యూనిఫాం కుట్టు పనులు

- వెంటనే స్కూళ్లకు అందించేలా ఏర్పాట్లు



తిమ్మాపురంలో యూనిఫాం కుట్టు పనిని పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : పాఠశాలల పునః ప్రారంభం నాటికి యూనిఫాం అందించాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు జాజిరెడ్డిగూడెం మండలంలో దుస్తుల కుట్టు పనులు పూర్తి కావస్తున్నాయి. మండలంలో జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం రెండు గ్రామాల్లో మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా మహిళా సంఘాలకు చెందిన మండలంలోని కుట్టు పని వచ్చిన 25మంది మహిళలు రేయింబవళ్లు పిల్లల స్కూల్ యూనిఫాం కుడుతున్నారు. కొంతమంది మహిళా సంఘం సభ్యులు కేంద్రాలకు వెళ్లడం వీలుకాక ఇళ్లలోనే కుడుతున్నారు.

**1545జతల యూనిఫాం రెడీ..**

జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 30 ఉన్నాయి. అలాగే 1కేజీబీవీ ఉంది. వీటిలో 1791మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సంబంధించి ఇప్పటికే 1545జతల స్కూల్ యూనిఫాం కుట్టారు. కుట్టు పనులను జూన్ 2 వరకు పూర్తి చేసి డ్రెస్‌లను వెంటనే పాఠశాలలకు అప్పగించనున్నారు. కుట్టు పనులను విద్యాశాఖ, సెర్ప్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఒక జతకు కుట్టు కూలి ప్రభుత్వం రూ.75 చెల్లించనుంది.

**1545 జతల యూనిఫాం సిద్ధం**



జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి 31 పాఠశాలలకు చెందిన 1791మంది పిల్లలకు దుస్తులు కుట్టాల్సి ఉండగా ఇప్పటికే 1545 జతల యూనిఫాంలు కుట్టారు. మిగిలినవి 2వ తేది వరకు పూర్తి చేసి ఎంఈవోకు అప్పగిస్తాం. 25మంది మహిళా సంఘం సభ్యులు దుస్తులను కుడుతున్నారు.

\- వలిశెట్టి మల్లేష్, ఏపీఎం

**స్కూల్స్ ప్రారంభం నాటికి పంపిణీ**



పాఠశాలల పునఃప్రారంభం నాటికి పిల్లలకు దుస్తులను పంపిణీ చేస్తాం. మండలంలో ఇప్పటికే యూనిఫాం కుట్టు పనులు పూర్తి కావస్తున్నాయి. ఈసారి మహిళలు కుట్టు పనులను తొందరగా పూర్తి చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికే ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది.

\- బి.బాలునాయక్, ఎంఈఓ

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మునగాల : కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష హెచ్చరించారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను స్థానిక వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, వారు కొనుగోలు చేసిన వాటికి విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. విత్తనాల అమ్మకాలకు సంబంధించి బిల్లులు తప్పకుండా రాయాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, రోజువారిగా విక్రయించే వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. విత్తనాల లభ్యత వివరాలను దుకాణాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.అనిల్‌కుమార్, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

## బీసీ జనగణన చేపట్టాలి

నడిగూడెం : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మండవ నాగమణి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని రత్నవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ జనగణన చేపట్టి ఆయా కులాల దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 45 శాతం పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

మోతె : మండల కేంద్రంలో కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం కంఠమహేశ్వరస్వామి సురమాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జలబిందెలతో ఆలయానికి తరలివచ్చి స్వామివార్లకు అభిషేకం చేశారు. శివపార్వతులకు పూజలు చేశారు. శనివారం బోనాల మహోత్సవం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

## బూరుగడ్డ ఆలయంలో పంచామృతాభిషేకం

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.